

# కదన కుతూహలం

**—ఓలేటి శ్రీనివాసరావు భాను**

సుబ్బరామయ్య ట్రాన్సిస్టర్‌లో సంగీత కచేరీ వింటూ ఉంటే పెద్ద మనమరాలు సిలోన్ వినాలని, రెండవది వివిధ భారతి కావాలని బలవంతాన ట్రాన్సిస్టర్ గుంజుకు పోతారు.

పక్క గదిలో సంభాషణమీదికి నా దృష్టి మళ్ళించాను.

కోడలు పెద్ద గొంతు పెట్టుకుని మాట్లాడుతూంది.

సుబ్బరామయ్య దీనంగా అడుగుతున్నాడు.

''అది తియ్యటానికి వీల్లేదు. నా కసలే తలపోటు'' అంది కోడలు.

''లేదు, వరలక్ష్మి. నేను మెల్లగా వాయించుకుంటాను, తల్లీ.'' బతిమాలుతున్నాడు సుబ్బరామయ్య.

''పిల్లలకి పరీక్షలు. మీరు నట్టింట్లో మఠం వేసుకుని కుయ్యో మొర్రో అని ఫిడేలు వాయిస్తూ కూర్చుంటే వాళ్ళ చదువులేం గాను?''

''సరే. అలా అయితే పెరట్లోకి పోతాను. నూతి పళ్ళెం మీద వేపచెట్టు నీడన నులక మంచం వేసుకుని సాధన చేసుకుంటాను.''

''సాధనా!'' అంటూ నవ్వింది పెద్ద మనమరాలు. నవ్వి '' ఏం తాతయ్యా, సాధన చేస్తే నలుగురూ మెచ్చుకుని శాలువాలు కప్పుతారని ఆశగా ఉందా? ఇంకా ఎందుకు చెప్పు తాపత్రయం హాయిగా రామకోటికి పోరాదూ? అక్కడ ఏదో యజ్ఞం చేస్తున్నారట'' అంటూ రేడియోలో ఆప్ హీకే గీత్ ట్యూన్ చేసింది ఆ అమ్మాయి.

**సుబ్బరామయ్యగారి** చెవులు శుభ్రంగానే పని చేస్తాయి!

కాని ఆ ఇంట్లో ఏ ఒక్కరూ అతనితో సాఫీగా మాట్లాడగా నేను వినలేదు. చెవిటివాడికి చెబుతున్నట్లు చెవులు చిల్లులు పడేలా కేకవేస్తారు. ''పోపొమ్మం''టున్నా వీధి గడప పట్టుకుని దేవులాడుతున్న ముసలి బిచ్చగాణ్ణి కసిరినట్లు, పెరటి దడిలోంచి దూరి వంటింట్లోకి రాబోయే కుక్క మీద కొరివి విసిరినట్లు, వాకిట్లో ఎండ బెట్టిన వడియాల మీద వాలబోతున్న కాకిని తిడుతున్నట్లు అసహనంగా మాట్లాడతారు.

కాదు—అరుస్తారు!

ఇంట్లో కొడుకు, కోడలు మొదలుకొని ఇద్దరు మనమరాళ్ళు, ఆఖరు మనమడి వరకు అందరిదీ ఒకటే శ్రుతి!

నేను వాళ్ళ వీధి గదిలో అద్దెకు దిగిన మొదటి రోజు సుబ్బరామయ్య గారికి వినికిడి లోపమేమో అనుకున్నాను. కాని మర్నాడు సాయంత్రం ఆఫీసు నుండి వచ్చి పెరట్లో నూతి దగ్గర ముఖం కడుక్కుంటున్నప్పుడు అతనితో మాట్లాడుతూ అర్థం చేసుకున్నాను—అతనికి చెవులు మామూలుగానే పని చేస్తాయని.

ఆ ఇంట్లో నేను చేరి వారం రోజులు కావస్తూంది.

ఆ రోజు ఆదివారం అనుకుంటాను.

ఉదయం ఎనిమిది గంటలు కావస్తున్నా బద్ధకిస్తూ పక్కమీద దొర్లుతున్నాను. వెనక గదిలో కోడలు సుబ్బరామయ్యగారిని కసురుతున్నట్లు మాట్లాడుతూంది. అతను దేని గురించో పాపం ప్రాధేయ పడుతున్నాడు. నేను వారం రోజులై గమనిస్తున్నాను. తినడాని కేదైనా పెట్టమని అడుగుతాడు. ఆవిడ తినడానికి ఏం పెడుతుందో తెలీదుగాని, చీవాట్లు మాత్రం పెడుతుంది. ''నీకు కూతుళ్ళ మీద ఉన్న అభిమానం ఒక్కగానొక్క కొడుకు మీద లే''దంటుంది. ''తొందరగా ఈ ఇంటిని నీ కొడుకు పేర రాయ''మని బలవంత పెడుతూ ఉంటుంది. అతను చెమటోడ్చి సంపాదించిన ఆ ఇంటిలో కూతుళ్ళకి ఎక్కడ వాటాలు రాసేస్తాడో అని ఆవిడ భయం! ఈ చొప్పు తల ఎత్తితే చాలు సుబ్బరామయ్యగారు ఆకలితో కడుపు మాడుతున్నా సరే, మారు మాట్లాడకుండా పోయి వీధి గడపలో కూర్చుంటారు. ఆ స్థితిలో అతన్ని చూస్తే కడుపు తరుక్కుపోతుంది. చూస్తూ చూస్తూ ఒక మనిషిని ఆకలికి వదిలేసి హాయిగా కడుపులు నింపుకొనే ఆ ఇంటి వాళ్ళని చూస్తే కరుడు గట్టిన స్వార్థం నా కళ్ళముందు కదలాడుతున్న ట్లనిపిస్తుంది.

ఇంటి పెత్తనం చెలాయిస్తున్న ఆ ఇల్లాలినీ, ఇల్లాలు గీసిన గిరిధిలో పడి కన్న తండ్రి మీద కనీస గౌరవం లేని ఆ ఇంటాయన్నీ, తాతగారిని జీతగాడికన్నా హీనంగా చూసే ఆ వంశాంకురాన్నీ ఏం చేస్తే పాపం చుట్టుకొంటుంది?

అతనికి వేళ కింత తిండి పెట్టరు. శీతాకాలం చన్నీళ్ళు పోసుకోలేను మొర్రో అని ముసలతను ఎంతగా మొర పెట్టుకున్నా ''మేం పోసుకోవటం లేదా? కట్టెలు వూరికే వస్తున్నాయా'' అంటుంది కోడలు. ''అవునవును'' అంటాడు కొడుకు. ఆఖరి మనమడు బాబ్జీ మా చెడ్డ గడుగ్గాయి. ''రా, తాతా'' అని బలవంతంగా అతని మీద చన్నీళ్ళు గుమ్మరిస్తాడు.

"పెరట్లో కూర్చుని సాధన చేసుకుంటే మీకు బాగానే ఉంటుందేమోగాని, మాకు మట్టుకు తల తీసేసినట్లుంటుంది. మీ కీ ఇంట్లో విలువ పీడ కూడా లేకుండా తరిమేశాం అని ఇరుగు పొరుగు వాళ్ళు మమ్మల్ని ఆడిపోసుకోరూ" అంది కోడలు.

ఇంతలో సుబ్బరామయ్యగారి కొడుకు సూర్య చంద్రరావు అరుపు వినిపించింది.

"అబ్బబ్బ! ఏమిటర్రా ఇంట్లో గొడవ! అది వారమన్నా ్య కాసేపు హాయిగా నిద్రపోనిస్తారు. పొండి—ఇక్కడ మాట్లాడకండి" అని కసిరాడు. కసిరి, బహుశా మళ్ళీ ముసుగు తన్నేసి ఉంటాడు సూర్యచంద్రరావు.

నేను పక్కమీంచి లేచాను.

సుబ్బరామయ్య నా గది పక్క నుండి వీధి అరుగు మీదకి పోయి కూర్చున్నారు.

అతను అలా వెళ్ళాడో లేదో వరలక్ష్మమ్మ గొంతు మళ్ళీ నాకు వినిపించింది. స్థాయి తగ్గించి సూర్య చంద్రరావుతో మాట్లాడుతూంది. ఆ గదిలో మాటలు ఈ గదిలోకి ఒక్క ముక్క కూడా పొల్లు పోకుండా వినిపిస్తున్నాయి.

"మిమ్మల్నే...!ఇదిగో! ఒయ్" అంది వరలక్ష్మమ్మ.

"వూఁ" అంటూ బద్దకంగా పలికింది సూర్య చంద్రరావు గొంతు.

"ఆ అటక మీద ఫిడేలు సంగతి ఏం తేల్చారు?"

". . ."

"గత నెలలో మీ స్నేహితుడు ఒకాయన వచ్చి చూసుకున్నాడు కదండీ! ఈ నెల జీతాలు అందు కున్నాక డబ్బులు ముట్టజెప్పి ఫిడేలు తీసుకు పోతానన్నాడు కదూ! మరిచిపోయారేమిటి? లేవండి లేచి తొందరగా తెమిలి అతన్ని కలుసుకోండి."

"ఉదయాన్నే అంత తొందర దేనికే? సాయంత్రమో, రేపో ఆఫీసులో కలుసు కుంటానులే"

"అలాగే అలాగే మీరు కలుసుకునేసరికి వాళ్ళ జేబులో డబ్బులన్నీ హుష్ కాకీ అయిపోతాయి. వచ్చే నెలకి మళ్ళీ వాయిదా వేసేస్తాడు. లేవండి, లేవండి. . . . "


ఇది ఆ సుబ్బరామయ్యగారు విన్నట్టు లేదు. వింటే అతను తప్పకుండా గుండె పగిలేలా ఏడుస్తాడని అనిపించింది. ఇంట్లో అందరూ చీదరించుకుంటున్నా, పెరట్లోకి పోయి సాధన చేసుకుంటానని బతిమాలుతున్నాడే పాపం, ఎంత అపురూపంగా చూసుకుంటున్నాడో ఆ వాయులీనాన్ని!

వీళ్ళు అసలు మనుషులేనా?

సంగీతం కూడా కరిగించలేనంత కఠినంగా ఉన్నాయా వీళ్ళ హృదయాలు?

ఈ వయసులో సుబ్బరామయ్యని కనీసంగా నైనా సుఖ పెట్టడం పోయి, ఆ బడుగు హృద యానికి సుఖ సంతోషాల్ని పంచి ఇస్తున్న సాధ నాన్ని తెగనమ్మివేయాలని చూస్తున్నారు— కిరాతకులు!

నేను గబగబ కాలకృత్యాలు ముగించుకుని వెనక వాటాలో సూర్యచంద్రరావుని కలుద్దామని వెళ్ళాను. నేను వెళ్ళే సరికి అతను పందిరిమంచం మీద బాసింపట్లు వేసుకుని, ప్లేటునిండా ఇడ్లీలు



పెట్టుకుని తింటున్నాడు. నన్ను పలకరించి, కుర్చీ చూపించి, వంటింట్లోకి ఒక కేక వేశాడు. వరలక్ష్మి ఒక ప్లేటులో మూడు ఇడ్లీలు పెట్టి నాకు తెచ్చింది. నా వెంటే సుబ్బరామయ్యగారు కూడా వచ్చారు. నేను అక్కడ ఉన్నానని కాబోలు అరనిమిషంకూడా ఒక ప్లేటులో ఇడ్లీలు తెచ్చింది.

కుశల ప్రశ్నలు, ఉపోద్ఘాతాలు అనవసరం అనిపించింది. చెప్పవలసిన విషయానికి నేరుగా వచ్చేశాను.

"నాకు ఫిడేలు నేర్చుకోవాలని ఉందండీ. సుబ్బరామయ్యగారికి వీలయితే అతని దగ్గర కుదురుదామనుకుంటున్నాను" అన్నాను.

సుబ్బరామయ్యగారి కళ్ళు ఆనందంతో మెరి శాయి.

ఏదో మాట్లాడబోయి తొట్రుపడ్డాడు. నోట్లో ఇడ్లీ ముక్క పొలమారింది. తలమీద కొట్టుకుంటూ నీళ్ళ కోసం చూశాడు. నాకోసం పెట్టిన నీళ్ళగ్లాసు అతనికి అందించాను.

"మా మామగారికి ఫిడేలు వచ్చునని మీ కెలా తెలుసు?" అంది వరలక్ష్మి పోలీస్ ఆఫీసర్లాగ.

నేను తడుముకోలేదు. జవాబు సిద్ధంగానే ఉంది.

"ఆ వెనక వేపు వరండాలో చూసేరా—సుబ్బ రామయ్యగారు ఫిడేలు వాయిస్తున్నట్టు ఫోటో ఉంది. అది చూసి మీ బాబ్జీని అడిగితే 'మా తాత గారికి ఫిడేలు వచ్చు' అన్నాడు" అని చెప్పాను.

సూర్యచంద్రరావు మా సంభాషణ మౌనంగా వింటున్నాడు.

వరలక్ష్మమ్మ ముఖం అదోలా పెట్టుకుంది. కారణం నేను పసిగట్టేను.

"మీకు అభ్యంతరం లేకపోతేనే సుమండీ! నేనేం వూరకే నేర్చుకోను. ఋణమో పణమో ముట్ట చెబుతాను" అన్నాను.

నా అస్త్రం పనిచేసింది!

వరలక్ష్మమ్మ ముఖం వికసించింది!

సూర్యచంద్రరావు కళ్ళెగరేశాడు.

సుబ్బరామయ్యగారి కనుకొలకుల్లో సన్నటి నీటి తెరని నేను మాత్రమే చూశాను.

● ● ● ●

సుబ్బరామయ్యగారి దగ్గర నా శిక్షణ మొద లైంది. అతని పాత ఫిడేలుకి కొత్త తీగెలు వేయించి, పూర్తిగా బాగు చేయించాను.

సుబ్బరామయ్యగారు ఫిడేలు పట్టుకుని ఎన్నాళ్ళయిందో స్వరాలు పట్టు చిక్కటంలేదు. చిక్కుపడిన స్వరతంతువుల్ని చెక్కు చెదరని సాధనా సంకల్పంతో విడదీయాలని కూర్చునేవాడు. తన అదుపు నుండి చేజారిపోయిన స్వరసంపద మీద మునుపటి ఆధిపత్యాన్ని సంపాదించాలని ప్రయత్నించేవాడు. ఆ ప్రయత్నంలో అతను నాకు అగస్త్యుని పుక్కిట బంధింపబడిన సురగంగని తిరిగి సంపాదించాలని ప్రయత్నించే భగీరథుడిలా అనిపించేవాడు. అందుచేత అతని శిక్షణలో నాకు బోధన కంటే సాధనే ఎక్కువగా కనిపిం చెది.

"సాధన లేని విద్య చెదలు పట్టి పోతుంది, బాబూ. కృషి లేనిదే కళకి రాణింపు లేదు. సరస్వతి కైనా సరే సాధన అవసరం. తీగల్ని నీ అదుపులో ఉంచుకోవాలి" అంటూ అతను వాయిస్తున్నప్పుడు వాయులీనం విషాదంగా పలికేది.

"ఎప్పుడైతే నామీద ఈ ఇంటి మనుషుల ఆదుపాజ్ఞలు ఎక్కువయ్యాయో అప్పుడే ఈ తీగెలు నా అదుపు తప్పిపోయాయి, బాబూ" అనే భావం నాకు స్ఫురించేది.

తన వాళ్ళకు భయపడి అతను నోటితో అనలేని బాధని తీగెల ద్వారా పలికిస్తున్నాడు. అది నాకు బాగా అర్థమయ్యేది.

రెండు నెలలు గడిచేయి.

సుబ్బరామయ్యగారి సాధన ఫలించింది. ఉక్కు తీగెలు అతని చెప్పుచేతల్లోకి వస్తున్నాయి.

స్మృతి ఫలకం మీద మాసిపోతున్న స్వరాక్ష రాలు సరికొత్త జిలుగులు సంతరించుకుంటు న్నాయి.

గంటల తరబడి నా గదిలో ఒళ్ళు మరిచి పోయి వాయిస్తూ కూర్చునేవాడు.

అతని వాయులీనపు తంత్రీ నాదాల్లో ఆకృతి దిద్దుకున్న త్యాగరాజ కృతులు పసిపాపల్లా చిట్టడుగులు వేసుకుంటూ నా ఒళ్ళోకి చేరుకునేవి. ప్రియురాలిలా హొయలు పోతూ నన్ను పిచ్చెక్కిం చేవి. కన్న తల్లిలా అక్కున చేర్చి నన్ను వూరడించేవి.

ఇక సంబాళించుకోవడం నా తరం కాలేదు.

గుండె లోతుల్లో ఘూర్ణిల్లుతున్న స్వరసాగర ఘోషని అదుపులో పెట్టడం నా చేత కాలేదు.

ఆ రోజు—

అంతవరకూ ఆ ఇంట్లో ఎవ్వరికీ తెలియ నీకుండా దాచి పెట్టిన నా ఫిడేలుని తీసి, శ్రుతి చేసి ఆవేశంగా కదన కుతూహల రాగంలో "రఘు వంశ సుధాంబుధి" కీర్తన అందుకున్నాను.

ఎదురుగా సుబ్బరామయ్యగారు బిత్తరపోయారు.

నేను సైగ చేశాను.

అతను పొదివి పట్టిన వాయులీనం ఆనందంతో ఉరకలెత్తింది.

కదన కుతూహలం దాని తీగెల్ని ఒరుసుకుంటూ పరవళ్ళు తొక్కింది.

అలా ఎంతసేపు వాయించేమో ఇద్దరికీ తెలియదు. పూర్తయ్యేక తేరుకుని నావేపు ఆశ్చ ర్యంగా చూసి, నన్ను కౌగలించుకున్నారు. కౌగలించుకుని అతను ఏదో అస్పష్టంగా గొణగడం నాకు వినిపించింది.

అదృష్టవశాత్తూ ఆ రోజు ఇంట్లో మరెవ్వరూ లేరు!

ఆ మర్నాటి నుండి మామూలే.

సుబ్బరామయ్యగారి దగ్గర నేను ఫిడేలు నేర్చు కుంటున్నాను. ★